నమస్తే తెలంగాణ
# జిందగీ II
హైదరాబాద్ | ఆదివారం 2 జూన్ 2024 www.ntnews.com

## అలా వచ్చి కూర్చునేవారు



**2011లో** 'లేడీస్ వర్సెస్ రిక్కీ బాల్' సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది పరిణీతి చోప్రా. ప్రియాంక చోప్రా చెల్లెలుగా ఇండస్ట్రీకి పరిచయమైన పరిణీతి పలు హిట్ సినిమాల్లో నటించి అభిమానులను సంపాదించుకున్నది. పోయినేడాది ఎంపీ రాఘవ్ చద్దాను పెండ్లి చేసుకున్నది. కెరీర్‌లో జరిగిన కొన్ని సంఘటనలను ఒక ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నది. అందులో స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌పై చేసిన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. షూటింగ్ సెట్స్‌లో రణ్‌వీర్ సింగ్ విచిత్రంగా ప్రవర్తిస్తారని పరిణీతి చెప్పింది. 'విచిత్రమైన డిజైన్ల దుస్తులు వేసుకుంటారు. ఏంటి అని అడిగితే ఈరోజు ఇదే ఫ్యాషన్ అంటారు. సెట్స్‌లోకి ప్యాంట్ వేసుకోకుండా వచ్చి పక్కనే కూర్చునేవారు. ప్యాంట్ వేసుకోమని ఎవరైనా చెబితే అప్పుడు వెళ్లి వేసుకునేవారు. రణ్‌వీర్ కారవాన్‌లోకి వెళ్లడానికి భయం వేసేది. ఒంటి మీద బట్టలు లేకుండా ఉండేవారు. అలా ఎందుకు తిరుగుతావు అని అడిగితే.. తనను అలా చూడటం వల్ల జీవితాలు మారిపోవు కదా అనేవారు. ఒక సినిమాలో రొమాంటిక్ సీన్ చేసే సమయంలో ప్యాంట్ లేకుండా సెట్‌లో కనిపించారు. నాకు ఇబ్బందిగా ఉంది అని చెప్పడంతో ప్యాంట్ వేసుకొని వచ్చారు' అని చెప్పుకొచ్చింది పరిణీతి.







## శూర్పణఖ పాత్రకైనా రెడీ

**భారీ** ప్రాజెక్టులు, ప్రతిష్ఠాత్మక చిత్రాలలో భాగం కావాలని నటీనటులు కోరుకుంటారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'రామాయణ్' సినిమా హాట్ టాపిక్‌గా మారింది. భారీ బడ్జెట్, భారీ తారాగణంతో తెరకెక్కనున్న ఈ సినిమాలో నటిస్తున్న వారి గురించి రోజుకో వార్త బయటికి వస్తున్నది. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో మిస్ యూనివర్స్ కిరీటాన్ని సొంతం చేసుకున్న లారా దత్తా ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ వార్తలపై.. ''రామాయణ్' లాంటి సినిమాలో భాగం కావాలని ఎవరైనా కోరుకుంటారు. అయితే, ఇందులో నటించాలని ఇప్పటివరకు నన్ను ఎవరూ సంప్రదించలేదు. అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. రామాయణ్‌లో కైకేయి పాత్ర నేను చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో నటించే అవకాశం వస్తే శూర్పణఖ, మండోదరి పాత్రలు చేయడానికైనా రెడీ. ఈ మూడు క్యారెక్టర్లలో దేనికైనా నేను న్యాయం చేస్తాను' అని చెప్పింది లారా దత్తా.



తెలుగు సినిమాల్లో
ఒకప్పుడు.. కథానాయకుడు
విశాఖ ఎక్స్‌ప్రెస్ దిగేవాడు!
కథానాయిక గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కేది!!
తెలంగాణ ఆగయా.. ఇండస్ట్రీ సోచ్ బదల్ గయా.. ఇప్పుడు
తెలుగు హీరో జోగిపేట నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు.
హైదరాబాద్‌లో బస్సెక్కి మెదక్‌లో దిగుతున్నాడు. దశాబ్దాలుగా తెలుగు
సినిమాల్లో విస్మరణకు గురైన తెలంగాణ యాస, ప్రాంతాలకు పనిగట్టుకొని ప్రాధాన్యం
ఇస్తున్నారు సినీజనాలు. ఒకప్పుడు కమెడియన్‌కు, క్రూరమైన విలన్‌కు పరిమితం చేసిన తెలంగాణ
యాస.. ఇప్పుడు హీరోల భాష. హీరోయిన్ల భాష. మాటలో తెలంగాణం.. పాటలో తెలంగాణం..
కథా వస్తువులో, కథనంలో, లొకేషన్లలో ఇలా వెండితెరపై తెలంగాణ పరిఢవిల్లుతున్నది.

# టాలీవుడ్‌లో తెలంగాణం



**'గుడివాడ ఎళ్లాను..** గుంటూరు పోయాను..' తెలుగు రాష్ర్టాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు గతంలో ఎన్నడో వచ్చిన పాట. చివరి పంక్తిలో ఏదో మొహమాటంగా 'వరంగల్లు' అనేసి ఊరుకున్నారు. నాటి సినీకవులకు 'రైక చూస్తే.. రాజమండ్రి.. పైట చూస్తే పాలకొల్లు..' గుర్తొచ్చాయి కానీ, ఇందూరు, అందోలు ఎందుకు యాదికి రాలేదో అర్థం కాదు. అంతెందుకు 'అ.. అంటే అమలాపురం'... అంటూ 'టక్కుటమారం బండి..' ఎక్కి ఉమ్మడి రాష్ట్రంలో ఊర్ల పేర్లు ఏకరువు పెట్టారు. జనగామ హంగామ మినహాయిస్తే.. అన్నీ అటువైపు పేర్లే!


**పాటల** సంగతి పక్కనపెట్టి.. మాటల కొద్దాం... 'ఎన్టీవోడంటే ఏమన్కున్నవ్ బై... దునియాల గసొంటి యాక్టర్ లేడన్నట్టు.. కానీ, ఏం చేస్తం! భీము దేశం కట్టిండు కదా!..' అని పేరుమోసిన దర్శకబ్రహ్మలు సైతం తెలంగాణ యాసను కామెడీ ట్రాక్‌కు పరిమితం చేశారు. అభ్యుదయ దర్శకులం అని చెప్పుకొన్న వాళ్లూ.. 'ఎవ్వడు పడ్డ డయ్యా గీ పరేషాన్లన్నీ..' అని విలన్ పాత్రలతో డైలాగులు చెప్పించి తెలంగాణ అస్తిత్వాన్ని క్రూరంగా చూపించే ప్రయత్నం చేశారు. నిన్న మొన్నటి వరకు పాతబస్తీ యాక్సెంట్‌ను విలన్ బ్యాచ్‌లో తొట్టిగ్యాంగుతో పలికించి దక్కనీ పరిమళాన్ని కంపుకొట్టిచ్చారు.



**తెలంగాణ** వచ్చింది.. టాలీవుడ్ పంథా మార్చుకుంది. మన భాషను గౌరవించడం నేర్చుకుంది. మన యాసకు పట్టం కట్టడం షురూ చేసింది. ఇప్పుడు హీరో పాత్ర అనర్గళంగా మన భాషలో మాట్లాడుతున్నది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'ఫిదా' చిత్రం తెలంగాణ గ్రామీణ సౌందర్యాన్ని, యాసలోని మాధుర్యాన్ని, మాండలికంలోని సొగసును అద్భుతంగా వెండితెర దృశ్యమానం చేసింది. పూర్తి తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ప్రధాన స్రవంతి ప్రేమకథా చిత్రంగా భారీ విజయాన్ని సాధించింది. ఇక సోలో సాంగుల్లోనూ తెలంగాణ స్లాంగు వినిపిస్తున్నది. 'టిల్లు' లొల్లి ఎట్లుంది. 'అట్లుంటది మనతోని..' అని పెద్దహీరోలు కూడా రీల్స్ పెట్టుకుంటున్నరు. 'జనం కోరేది మనం శాయడమా...' అని నేపాళ మాంత్రికుడు అన్నట్టు.. ప్రేక్షకుల అభిరుచి మేరకు స్టార్ హీరోలూ తెలంగాణ యాసకు కట్టుబడ్డారు. మన మాటల్లో పరిమళాన్ని ఇన్నాళ్లకు అర్థం చేసుకోగలిగారు. తెలంగాణ ఏర్పాటుతో మాట పాటల్లో మాత్రమే కాదు.. సాంకేతిక వర్గం నుంచి నటీనటుల వరకు తెలంగాణకు సముచిత పాత్ర దక్కుతున్నది. కథల్లో తెలంగాణ నేపథ్యం ప్రతిఫలిస్తున్నది. లొకేషన్లలో మన ప్రాంతాలు కొత్తగా కనువిందు చేస్తున్నాయి. అలా తెలంగాణ చుట్టూ అల్లుకున్న కథలు చక్కటి విజయాలు సాధిస్తున్నాయి. కేవలం వెండితెర మీదనే కాకుండా ఓటీటీ, డిజిటల్ మీడియాలో కూడా తెలంగాణ నటీనటులు, సాంకేతిక నిపుణులు చక్కటి ప్రతిభను కనబరుస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన హీరోలు ఇండస్ట్రీలో ఇప్పుడు బలంగా స్థిరపడుతున్నారు.

### విజయ్ నుంచి ఆనంద్ వరకు

'పెళ్లిచూపులు'తో టాలీవుడ్‌కు పరిచయమైన హీరో విజయ్ దేవరకొండ. మొదటి సినిమాలో ఫక్తు తెలంగాణ యాసతో ఇరగదీశాడు. ఇందులోని పాత్రలన్నీ దాదాపు మన యాసనే పలికాయి. సినిమా హిట్టు. 'అర్జున్‌రెడ్డి' మళ్లీ మన యాస. మళ్లీ విజయం. మొత్తంగా విజయ్ దేవరకొండ టాలీవుడ్‌లో తెలంగాణ గొంతుగా స్థిరపడ్డాడు. విజయ్ తర్వాత విశ్వక్‌సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి హీరోలు వెండితెరపై తమదైన తెలంగాణ యాసతో ఆకట్టుకున్నారు.



సిద్ధు జొన్నలగడ్డ నిన్నటికి నిన్న 'టిల్లు స్క్వేర్'గా మరోసారి హిట్టుకొట్టాడు. ఒకరేమిటి ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, జబర్దస్త్ వేణు వీళ్లంతా తెలంగాణ ఒడిలో పెరిగిన బిడ్డలే! ప్రియదర్శి, వేణు కలిసి పండించిన 'బలగం' తెలంగాణ పల్లె గొప్పదనాన్ని పదికాలాలూ నిలిచేలా చేసింది. మన ప్రాంతంలో బంధాలు ఎంత బలంగా ఉంటాయో నిరూపించింది. అంతకుముందు ప్రియదర్శి నటించిన బయోపిక్ 'మల్లేశం' మరో సంచలనం. ఆసు యంత్రాన్ని కనిపెట్టిన పోచంపల్లి నేతన్న మల్లేశాన్ని స్టార్ హీరోను చేసింది. ఇక సింగరేణి నేపథ్యంలో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'దసరా' చిత్రం వందకోట్ల వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద సత్తాచాటింది. విజయ్ సోదరుడు ఆనంద్ దేవరకొండ కూడా వరుస విజయాలు సాధిస్తూ టాలీవుడ్‌లో తెలంగాణ హీరోల పాత్ర పెంచాడు.

### దర్శకులకూ బ్రహ్మరథం

తెలంగాణ వచ్చాక మన హీరోలకే కాదు, దర్శకులకూ ప్రాధాన్యం పెరిగింది. తెలంగాణ మట్టిలో పుట్టి మాణిక్యాలుగా వెలుగొందుతున్నారు. తరుణ్‌భాస్కర్ 'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది', 'కీడాకోలా' చిత్రాలతో పేరు తెచ్చుకున్నాడు. జబర్దస్త్ వేణు కాస్తా.. 'బలగం' వేణుగా స్థిరపడ్డాడు. 'నీది నాది ఒకే కథ', 'విరాటపర్వం' చిత్రాలతో వేణు ఊడుగుల వెండితెరపై తనదైన ముద్రను వేశాడు. 'జాతిరత్నాలు'తో అనుదీప్ కిరాక్ దర్శకుడు అనిపించుకున్నాడు. 'అర్జున్‌రెడ్డి'తో అదరగొట్టిన సందీప్ వంగా 'యానిమల్'తో పాన్ ఇండియా దర్శకుడిగా స్థిరపడ్డాడు. 'దసరా' చిత్రంతో శ్రీకాంత్ ఓదెల కమర్షియల్ డైరెక్టర్‌గా సత్తా చాటాడు. ఇలా పదుల సంఖ్యలో తెలంగాణకు చెందిన దర్శకులు ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఒకటేమిటి.. దశాబ్ది తెలంగాణలో ఊహించని మార్పులు ఎన్నో చోటు చేసుకున్నాయి. గడిచిన పదేండ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించింది. వెండితెరపైనా అదే రేంజ్‌లో తెలంగాణం బంగారం అనిపించుకుంటున్నది.

## అది నాకు అవసరం



**అందం,** నటన, డ్యాన్స్‌తో అభిమానులను అలరిస్తున్నది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. నటనకు ఆస్కారం ఉన్న క్యారెక్టర్లతోపాటు గ్లామర్ రోల్స్‌తోనూ మెప్పిస్తున్న ఈ బ్యూటీ.. తాజాగా ముద్దు సీన్లతోపాటు శృంగార సన్నివేశాల్లో నటించకూడదనే రూల్‌ను పక్కన పెట్టేసింది. 'లస్ట్ స్టోరీస్-2'లో తమన్నా నటించిన సన్నివేశాలు అభిమానులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. 'లస్ట్ స్టోరీస్-2' సిరీస్‌లో శృంగార సన్నివేశాల్లో నటించడంపై ఒక ఇంటర్వ్యూలో బోల్డ్ కామెంట్స్ చేసిందీ భామ. 'లస్ట్ స్టోరీస్ మొదటి భాగం చూసిన తర్వాత శృంగార సన్నివేశాలపై నా అభిప్రాయమే మారిపోయింది. బోల్డ్‌గా కనిపిస్తే తప్పేంటి అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. అందుకే 'లస్ట్ స్టోరీస్-2'లో నటించాను. అభిమానులు ఇలాంటి సిరీస్‌లు, సీన్లు చూడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రజలు నన్ను ఎలా చూడాలని అనుకుంటున్నారో అలాగే స్క్రీన్‌పై కనిపించాలి. నటిగా అది నాకు అవసరం. బోల్డ్ సీన్స్‌లో నటించేటప్పుడు టెన్షన్ పడలేదు. ఆ క్రెడిట్ విజయ్ వర్మకు దక్కుతుంది. తను నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు' అని చెప్పుకొచ్చింది తమన్నా.

## ఫోకస్ అంతా ఆ హీరోలపైనే



**'ఏ** మాయ చేశావె' సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది సమంత. తెలుగుతోపాటు పలు భాషల సినిమాల్లో నటిస్తూ మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నది. వరుస సినిమాలు చేస్తున్నప్పుడే అక్కినేని నాగచైతన్యను ప్రేమించి పెండ్లి చేసుకున్నది. పలు కారణాలతో విడాకులు తీసుకుంది కూడా. ఆ తర్వాత అనుకోకుండా సమంత.. మయోసైటిస్ బారిన పడ్డది. కొంతకాలం విరామం తీసుకుని విదేశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నది. మయోసైటిస్ నుంచి కోలుకున్న అనంతరం 'సిటాడెల్' సిరీస్‌లో నటించింది సామ్. అయితే, తెలుగులో ఈ బ్యూటీకి అవకాశాలు రావడం లేదని సినీ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. నాగచైతన్యతో విడాకులు తీసుకున్న అనంతరం సమంతకు టాలీవుడ్‌లో అవకాశాలు దక్కడం లేదని, అందుకే తెలుగు సినిమాల్లో ఆమె నటించడం లేదని అభిమానులు భావిస్తున్నారు. కాగా, మయోసైటిస్‌కు చికిత్స తీసుకునేందుకు సంవత్సరంపాటు సినిమాలకు దూరంగా ఉన్నది సామ్. ఈ సమయంలో ఇండస్ట్రీలోకి పలువురు కొత్త హీరోయిన్లు వచ్చారని, అందుకే ఆమెకు అవకాశాలు తగ్గాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తున్నది. అల్లు అర్జున్, అట్లీ దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాలో సామ్ హీరోయిన్‌గా నటించనుందని వార్తలు వచ్చినప్పటికీ అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం సామ్.. సొంత బ్యానర్‌లో ఒక సినిమా చేస్తుండగా, మరో వెబ్ సిరీస్‌లో నటిస్తున్నది. కాగా, టాలీవుడ్‌లో స్టార్ హీరోల పక్కన నటించకూడదని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. అంతేకాదు, బాలీవుడ్ హీరోలతో సినిమాలు చేయడంపైనే ఎక్కువగా ఫోకస్ చేసిందని టాక్.

## గ్రామ రాజకీయాలు
### పంచాయత్ సీజన్ 3

**అమెజాన్ ప్రైమ్:** మే 28
**తారాగణం:** జితేంద్ర కుమార్, నీనా గుప్తా, రఘువీర్ యాదవ్, ఫైజల్ మాలిక్ తదితరులు
**దర్శకత్వం:** దీపక్ కుమార్ మిశ్రా

**పంచాయత్..** ఇప్పటికే రెండు సీజన్లు సక్సెస్ కావడంతో మూడో సీజన్ కోసం అభిమానులు రెండేండ్లుగా ఎదురుచూశారు. ఈ క్రమంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్‌లో మే 28 నుంచి పంచాయత్ 3 స్ట్రీమింగ్‌కు వచ్చింది. పులేరా అనే గ్రామంలో జరిగే పరిణామాలతో పంచాయత్ సిరీస్ తెరకెక్కుతున్నది. కాగా, ప్రహ్లాద్ (ఫైజల్ మాలిక్) కొడుకు మరణించడం, పులేరా నుంచి పంచాయతీ సెక్రటరీ అభిషేక్ త్రిపాఠి (జితేంద్ర కుమార్) ట్రాన్స్‌ఫర్ కావడంతో రెండో సీజన్ ముగిసిన విషయం తెలిసిందే.

**కథ:** పులేరాకు కొత్త సెక్రటరీ రావడంతో మూడో సీజన్ మొదలవుతుంది. సర్పంచ్ మంజుదేవి (నీనా గుప్త), భర్త బ్రిజ్ భూషణ్ దూబే (రఘువీర్ యాదవ్), ప్రహ్లాద్ సహా గ్రామస్తులు కొత్త సెక్రటరీని అడ్డుకుంటారు. అభిషేక్ త్రిపాఠిని మరోసారి సెక్రటరీగా తెచ్చుకుంటారు. దీంతో ఎమ్మెల్యే చంద్ర కిశోర్ సింగ్ (ప్రకాశ్ ఝా)తో దూబే సహా పులేరా గ్రామస్తులకు ఉన్న విభేదాలు పెరుగుతాయి. ఓ వృద్ధురాలికి ప్రధానమంత్రి గరీబ్ ఆవాస్ యోజన కింద ఇంటిని అభిషేక్ మంజూరు చేయటంతో పులేరాలో రాజకీయాలు మొదలవుతాయి. సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎమ్మెల్యేతో పులేరాలో ఉండే భూషణ్ (దుర్గేశ్ కుమార్) చేతులు కలిపి మంజూదేవి, బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాడు. ఆ తర్వాత పులేరాలో రాజకీయాలు ఎలా సాగాయి అనేది మూడో సీజన్ కథ.




పంచాయత్ సీజన్ 3 అక్కడక్కడా స్లోగా అనిపించినా ఆకట్టుకుంటుంది. రెండు సీజన్లతో పోలిస్తే కామెడీ, ఎంటర్‌టైన్మెంట్ కాస్తంత తగ్గినా ఎమోషన్లు మెప్పిస్తాయి. పాలిటిక్స్ ఆసక్తికరంగా సాగుతాయి. ఈ సిరీస్ తెలుగులో అందుబాటులో లేదు. హిందీ ఆడియోతో ఉన్న పంచాయత్ 3 సిరీస్ ఫ్యామిలీతో కలిసి చూడవచ్చు.